# వారఫలాలు



పాలకూర సీతాలత

అంబాజీరావుకి ముందునుంచీ కూడా పత్రికలలో పడే వారఫలాలు చదవడం అలవాటు లేదు. ఆ పేజి రిగానే చటుక్కున పక్క పేజీలోకి వెళ్లిపోతాడు. కథలు, కాకరకాయల మీద వున్న ఆసక్తి అతనికి ఈ వారఫలాలు మీద లేదు. ఏదో ఊతపదంగా కాకరకాయలు అన్నమాట వాడానుకానీ పుస్తకాల్లో కాకరకాయలు వుంటాయని కాదు.

ఒకరోజు అతని ఆప్తమిత్రుడు అఖిలాండేశ్వరరావు వచ్చాడు. మాటల సందర్భంలో తను వారఫలాలు క్రమం తప్పకుండా చదువుతాననీ, అందులో రాసినవి నూటికి నూరుశాతం నిజం అయ్యాయనీ చెప్పాడు అంబాజీరావుతో.

"ఏం రాశారు? ఏం నిజం అయ్యాయి?" అడిగాడు అంబాజీరావు.

అఖిలాండేశ్వరరావు గొంతు సవరించుకున్నాడు.

"గృహంలో కలతలు అని రాసిన వారంలో ఊర్నించి మా అమ్మ వచ్చింది. దాంతో అత్తా కోడళ్ల మధ్య హోరాహోరి పోట్లాటలు ప్రారంభం అయ్యాయి. అప్పుడు గృహంలో కలతలు వచ్చాయి. ఆకస్మిక ధనలాభం అని రాసిన వారంలో ఏదో క్విజ్ లో పాల్గొన్నందుకు బహుమతి మొత్తం పంచగా నాకు ఒక రూపాయి వచ్చింది. వినోద కార్యక్రమంలో పాల్గొంటారు అని రాసిన వారంలో రోడ్డు పక్కన పాము—ముంగిసల పోట్లాట చూశాను గృహంలో శాంతి సౌఖ్యాలు అని రాసిన వారం మా అమ్మ వెళ్లిపోయింది. దాంతో అత్తాకోడళ్ల పోట్లాటలు లేకపోయాయి కనుక శాంతి లభించింది. ప్రయాణాలు చేస్తారు అని రాసిన వారంలో పక్క ఊరికి సైకిలు మీద వెళ్లాను. విందుల్లో పాల్గొంటారు అని రాసిన వారం ఏం మూడ్ వచ్చిందో కాని మా ఆవిడ సేమ్యాపాయసం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతయినా వుంది.....

వారఫలాల్లో ఇంత నిజం వుందా అని ఆశ్చర్యపోయాడు అంబాజీరావు. ఆ ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. ఎక్కువ సేపు నోరు అలాగే వుంచితే ఈగలు దూరతాయన్న భయంతో నోరు మూసుకున్నాడు తర్వాత.


"అయితే నువ్వు వారఫలాలు నమ్ముతావన్నమాట'.. అన్నాడు అంబాజీరావు.

"యస్" అన్నాడు అఖిలాండేశ్వరరావు.

"నన్ను నమ్మమంటావన్న మాట..."

"అవును"

ఇంకా ఏదో ప్రశ్న




అడగాలనుకున్నాడు అంబాజీరావు. కానీ అఖిలాండేశ్వరరావుకి ఇంగ్లీషు, తెలుగు తప్పవేరే భాషలు రావు కనుక వాడిని ఇబ్బంది పెట్టడం ఎందుకని మానేశాడు.

"ఇలాంటిది ఏదో జరుగుతుందని అనుకుంటూనే వున్నాను. ఈ వారం నాకు 'మిత్రులకు సహాయ పడతారు' అని రాసివుంది వారఫలాల్లో. నీకు సహాయం చేశాను. వారఫలాలు నిజం అవుతాయని మరొక సారి రుజువు అయ్యింది కదా!" అన్నాడు అఖిలాండేశ్వరరావు.

"అవునా?" ఆశ్చర్యపోయాడు అంబాజీరావు

"యస్" అంటూ తల ఊపాడు అఖిలాండేశ్వరరావు

ఇకముందు తను కూడా వారఫలాలు చూసుకోవాలని నిర్ణయించుకున్నాడు అంబాజీరావు. వారపత్రిక పక్కవాళ్ళు తీసుకున్నారు.

ఆ మర్నాడు కొత్త పత్రికలో వారఫలాలు చూసుకున్నాడు అంబాజీరావు. చదివినప్పుడు అందులో అన్నీ మంచి విషయాలే వుండటంతో ఆనందపడిపోయాడు. రెండు మూడు రోజులు గడిచాయి. అవి నిజం కాలేదు. అందుకని కొంచెం నిరాశపడ్డాడు. ఇలా ఒకసారి కాదు... రెండు మూడు వారాలూ జరిగింది.

దాంతో వారఫలాల మీద నమ్మకం కొంచెం సన్నగిల్లినా మధ్యలో అఖిలాండేశ్వరరావు వచ్చి ఊరడించడంతో కొంచెం తేరుకున్నాడు.

"ఆకస్మిక ధనలాభం.." అని రాసివున్న వారం అప్పులకోసం మిత్రులముందు చెయ్యి జాపవలసి వచ్చింది, భార్య తాలూకు చుట్టాలు ఒక అరడజను మంది ఒకేసారి దాడి చెయ్యడంతో "ఏ రకమైన చికాకులూ లేకుండా ప్రశాంతముగా కాలం గడుపుతారు..." అని రాసిన వారం అతని కొడుక్కి డీసెంట్రిపట్టుకోవడంతో డాక్టర్ చుట్టూ తిరుగుతూ, ఇంట్లో కూడా అశాంతిగా గడపవలసి వచ్చింది.

"శుభవార్తలు వింటారు..." అని చదివినప్పుడు అతని భార్య యొక్క బామ్మగారు కాలం చేసిందన్న కబురు వచ్చింది. 'బంధువుల రాక' అని రాసిన వారంలోనే అంతవరకు తిష్ఠవేసికొని కూర్చున్న బంధువులు వెళ్ళిపోయారు "విందుల్లో పాల్గొంటారు.." అని రాసివున్న వారం. అంతా హైటెంపరేచర్‌తో బాధపడ్డాడు. అందువల్ల పచ్చడి మెతుకులు కూడా తినలేకపోయాడు. బ్రెడ్ ముక్కల్తో రోజులు గడిపాడు. "గాంధీ" ఇంగ్లీషు సినిమాకు వెళ్లాలని ఎంతగా ప్రయత్నించినా టికెట్లు దొరకలేదు. "వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు" అని రాసిన వారంలో తనకు తప్పకుండా టిక్కట్లు దొరుకుతాయని ఆశించాడు. అందుకే కుటుంబంతోసహా ఆ సినిమాకు బయలుదేరాడు. అప్పుడూ టిక్కట్లు దొరకలేదు.

"ఏదో సినిమాకు వెళ్లితీరాలి పదండి తెలుగు సినిమాకు..." అంది భార్య. ఎదురు చెప్పకుండా సినిమాకు వెళ్లాడు.

అది మళయాళం. డబ్బింగు సినిమా కాకపోయినా ఇంచుమించు అంత ఘోరంగానే వుంది. హీరోయిన్ బాత్‌టబ్‌లో స్నానం చేస్తూ పాటపాడుకోవడం తీశాడు. వీపంతా నగ్నంగా చూపించడం, కొంచెం టబ్ అడ్డం వచ్చేలా క్లోజప్పు, బట్టలు విప్పిపారెయ్యడం, నేలమీంచి పిరుదులదాకా నగ్న శరీరం — అంతా ఘోరంగా చూపించాడు.

"స్నానం చేస్తున్నప్పుడు పాట ఎందుకు డాడీ?" అన్నాడు అయిదేళ్ల కొడుకు. "స్నానం ఎలా చెయ్యాలో మనకు తెలుసు కదా మమ్మీ..ఎందుకు చూపిస్తున్నాడు ఇదంతా?" అని ఆరేళ్ల కూతురు తల్లిని అడిగింది.

"ఇదంతా మన ఖర్మ తల్లీ..." అంటూ ఇంటర్వెల్లో అందర్నీ తీసుకుని వెళ్లిపోయాడు ఇంటికి.

"వినోద కార్యక్రమాల్లో పాల్గొనడం అంటే ఇదేకాబోలు.." అని తలకు అమృతాంజనం రాసుకుంటూ

అనుకున్నాడు.


"ప్రయాణాలు లాభిస్తాయి.." అని రాసిన వారంలో నిజంగానే ప్రయాణం తగిలింది. వారఫలాలు ఇన్నాళ్ళకు నిజం కాబోతున్నాయని ఆనందించాడు అంబాజీరావు. రైల్లో అతని జేబు ఎవ్వరో కత్తిరించారు. అంతేకాదు విలువైన సామాన్లు వుంచిన సూట్ కేస్‌ని కూడా ఇంకెవరో దింపుకుని పోయారు. నెత్తీ—నోరు మొత్తుకున్నాడు. ఎయిర్ బ్యాగ్‌లో పెట్టిన డబ్బుల్తో గమ్యం చేరాడు. కసిగా పళ్ళు కొరుక్కుంటూ "అవునవును.. ప్రయాణాలు బాగానే లాభించాయి..." అనుకున్నాడు.

"గృహంలో సుఖశాంతులు.." అని రాసివున్న వారం భార్య అతనితో గొడవ పడింది. "జరీ చీర కొంటారా లేక గోదావరిలో దూకనా?" అని బెదిరించింది. రెండు నిముషాలు ఆలోచించాడు.

తను జరీ చీర కొనడంకంటే ఆమె గోదావరిలో దూకడం సులభం అనుకొని—

"గోదావరిలో దూకు..." అన్నాడు

దాంతో మరింత రెచ్చిపోయింది భార్య—




"నేను గోదావరిలో దూకను..జరీచీర వద్దని అనను.." అంటూ గొడవ పెట్టుకుంది.

వచ్చేనెలలో కొంటానని అన్నాడు. అప్పుడే "గృహంలో సుఖశాంతులు" కలిగాయి.

"పూర్ణచంద్రుడు ఈవారంలో అనుకూల ప్రదుడుగా వున్నాడు. శుక్ర, శనివారాలలో అతని ప్రభావం వలన సర్వతోముఖంగా శాంతి సౌఖ్యాలను పొందనున్నారు.." అని చదివి ఆనందించకుండా వుండ లేకపోయాడు అంబాజీరావు. ఆ శుక్రవారం కోసం ఆత్రంగా ఎదురుచూశాడు. ఆరోజు ఆఫీసుకు వెళ్తుంటేతన స్కూటర్‌ని ఒక లారీ గుద్దేసింది. స్కూటర్ నుగ్గు అయ్యింది. తను వెళ్లి అంతదూరంలో ఎగిరి పడ్డాడు. చెయ్యి విరిగింది. హాస్పిటల్లోనే వున్నాడు. ఆ హాస్పిటల్లో వుండగానే పుస్తకం తెప్పించుకుని వారఫలాలు చదివాడు.


"గతవారంగా ఉన్న ఇబ్బందులు, అవరోధాలు క్రమక్రమంగా క్షీణించి అనుకూల వాతావరణం ప్రాప్తి కానున్నది.." అని రాసివుంది. హాస్పిటల్ నుంచి ఈ వారం రిలీవు చేస్తారని ఆశించాడు అది చదివి. కానీ డాక్టర్ వచ్చి కనీసం మరో పదిరోజుల దాకా డిశ్చార్జి చెయ్యకూడదన్నారు. అదేవారం ఇంకో విషయం రాసివుంది. "పునర్వసు చతుర్ధ పాదమందు జనించిన వారికి ఈ వారం కుటుంబ కలహాలు సూచకం" అని వుంది. అది విని గుండెలు బాదుకున్నాడు. అసలే అనారోగ్యంతో, కుంటి చెయ్యితో బాధపడుతూ వుంటే. భార్య హాస్పిటల్‌కి వచ్చి మరీ పోట్లాట పెట్టుకుంటుందా ఏమిటి భగవంతుడా అని చింతించేడు. ఈ సారి "మరో జరీ చీర కొంటారా లేక కృష్ణలో దూకనా?" అని గొడవ పడుతుందేమో అని బెంగపడ్డాడు. ఆమె అలా అంటే ఏం జవాబు చెప్పాలా అని ఆలోచించాడు.

"కృష్ణలో దూకడానికి అయితే మళ్ళీ ఏరైలో ఎక్కి వెళ్లాలి. గోదావరి అయితే ఊర్లోనే వుంది మరి..." అని మధన పడ్డాడు. కృష్ణలో వద్దనీ, గోదావరిలోనే దూకమనీ అనాలని అనుకున్నాడు. కానీ ఆ వారం గడిచిపోయినా భార్య అతనితో గొడవ పడలేదు. పైగా మరింత ప్రేమగా మాట్లాడింది. హాస్పిటల్‌కు భోజనం తీసుకుని వస్తూ అవసరమైన సేవలు చేస్తోంది.

"నావల్ల నీకు అనవసరంగా శ్రమకల్గుతోంది.." అన్నాడు ఒకరోజు.

అందుకు ఆమె బాధపడింది. కళ్ళలో నీళ్ళు చిందాయి.

"అలా అనకండి..మీకోసం కాకపోతే నా బ్రతుకు ఎందుకు! మీకు సేవ చెయ్యడం భార్యగా నా ధర్మం కాదా? ఇందులో శ్రమ ఏమిటి? మీరు అలా




అంటే నేను బాధపడవల్సివస్తుంది. మీరు వెంటనే కోలుకుని ఇంటికి రావాలని వెయ్యి దేముళ్ళకు మొక్కుకుంటున్నాను..." అంది.

తనది పునర్వసు నక్షత్రం కాదా అని అనుమానించాడు. భార్యను అడిగాడు. ఆమె అవునని నిర్ధారణ చేసింది.

మరోవారం తర్వాత ఇంటికి వచ్చాడు.

ఆ వారం వారఫలాల్లో "ఆర్ధికంగా లోటువుండదు.." అని రాసి వుంది.

శలవు లేకపోవడం వల్ల హాస్పిటల్లో వున్నన్ని రోజులూ జీతం నష్టం అయింది.

పైగా హాస్పిటల్ ఖర్చులు ఒకటి. ఆ వారం అంతా డబ్బుకి కటకటలాడుతూనే వున్నాడు. జీతాలు వస్తేనే మధ్యతరగతి జీవితాల్లో కటకటకదా! మరి ఇలాంటి పరిస్థితిలో అంబాజీరావు ఎంత బాధగా రోజులు గడిపాడో ఊహించుకోవచ్చు.

అదేవారంలో "అధికారుల అనుగ్రహానికి పాత్రులవుతారు.." అని వుంది. కానీ ఆఫీసుకు వెళ్ళగానే అతని ఆఫీసరు గతంలో ఎప్పుడో జరిగిన పొరపాటుకి చిచ్చుబుడ్డిలా అంత ఎత్తున లేచాడు. టపాకాయలా పేలాడు. సిసింద్రీలాగ చిందులు వేశాడు. ఏదో రకంగా సర్ది చెప్పేసరికి తల్ప్రాణం తోకకు వచ్చింది.

ఆరోజు ఫైనల్‌గా నిర్ణయించుకున్నాడు

ఇక తను ఛస్తే వారఫలాలు నమ్మడు. నమ్మమని అఖిలాండేశ్వరరావులాగ ఇతరులకు సలహా చెప్పడు.

ఏదో వస్తుందనో, ఏదో మంచి జరుగుతుందనో ఆశించి అది జరగకపోయేసరికి నిరాశ కల్గుతుంది. అంతకంటే ఏమీ తెలియనట్లుగా వుండి మంచి జరిగితే బాగుందని సంతోషిస్తూ, చెడు జరిగితే, పోనిలే.. అని సరిపెట్టుకుంటూ వుంటేనే మంచిదని అనుకున్నాడు.

"అఖిలాండేశ్వరరావుని రానీ... వాడి నెత్తిమీద వున్న రెండు పుంజీల వెంట్రుకలూ పీకి పారెయ్యాలి.." అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

కానీ మరో వారం రోజులదాకా వాడు కన్పించలేదు.

ఆ రోజు అఖిలాండేశ్వరరావు వచ్చాడు అంబాజీరావు ఇంటికి. అతని చేతిలో కొత్త వార పత్రిక వుంది.

"కూర్చో.." అన్నాడు అంబాజీరావు.

"జరగబోయేది ఖచ్చితంగా చెప్పే ఈ వారఫలాలు.." అంటూ ఏదో మాట్లాడుతూ కూర్చున్నాడు అఖిలాండేశ్వరరావు.

ఆ ప్రస్తావన వచ్చేసరికి వాడికి కాఫీ తెమ్మని భార్యకు చెప్పాలనుకున్నవాడు కాస్తా ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

కొత్తపత్రిక తెరిచి — "నీ నక్షత్రం




ఏమిటి?'' అన్నాడు అఖిలాండేశ్వరరావు.

''నీ పిండాకూడు..'' అన్నాడు కోపంగా అంబాజీరావు

''అశ్వని, భరణి...'' అంటూ నక్షత్రాల పేర్లు అన్నీ చదివి—

'అరే..ఇందులో పిండాకూడు అన్న నక్షత్రం లేదే..' అన్నాడు అఖిలాండేశ్వరరావు.

ఆ తర్వాత అంబాజీరావు మాటలు అర్థం చేసుకుని ''ఎందుకంత కోపం?'' అన్నాడు.

'ఇంకోసారి వారఫలాలు గురించి మాట్లాడితే నిన్ను హత్యచేస్తా..'' అన్నాడు అంబాజీరావు

''ఎందుకు..''

జరిగిందంతా చెప్పాడు అంబాజీరావు

''నీవొక్కడికే ఇలా ఎందుకు జరిగిందో అర్థంకావడం లేదు.. నా విషయంలో అన్నీ నిజాలే అయ్యాయి.., నీ నక్షత్రం చెప్పు.. ఈ ఒక్కవారం ఏం రాశాడో చూద్దాం..'' అన్నాడు అఖిలాండేశ్వరరావు నచ్చచెప్తూ.

చెప్పాడు అంబాజీరావు. కొత్త పుస్తకం తెరిచి ఆ వారం ఏం రాశారో చదివాడు అఖిలాండేశ్వరరావు.

గత రెండు నెలలుగా మిమ్మల్ని మాయమాటలతో ఎవరో మోసం చేస్తున్నారు..'' అని ఒక వాక్యం చదవగానే

''ఆగు ..'' అన్నాడు అంబాజీరావు. ఆగాడు అఖిలాండేశ్వరరావు.

''మళ్ళీ చదువు..''

మళ్ళీ చదివాడు...

''ఇది నిజమే.. ఈ రెండు నెలలుగా నన్ను మాటల్తో మోసం చేస్తున్నది ఈ వారఫలాలు రాసిన పెద్దమనిషే..'' అన్నాడు అంబాజీరావు

''తర్వాత చదువుతాను.. ఆ మాయమాటలు ఇకముందు నమ్మటం మానేస్తారు....''

''ఆగు .. ఇది నిజమే.. వారఫలాలు ఇకముందు నమ్మకూడదని నిర్ణయించుకున్నాను..''

చిన్నబుచ్చుకున్న అఖిలాండేశ్వరరావు పుస్తకం మూసేసాడు. ఆ అవమానం తనకే జరిగినంతగా బాధపడ్డాడు.

ఇంతలో మెరుపులా ఆలోచన వచ్చింది.

''అంబాజీరావు! ఈవారం వారఫలాల్లో రాసింది నిజమని నమ్ముతావా?'' అన్నాడు

''ఆ... చాలా కరక్టుగా రాసాడు..'' అన్నాడు అంబాజీరావు

''మరింకేం?.. వారఫలాల్లో నిజమే రాస్తారు అని నువ్వే ఒప్పుకున్నావు.. నేనూ అదే అంటాను... గతంలో నీకు రాసింది ఏదో కారణం వల్ల నిజం కాలేదు కానీ ఇప్పుడు రాసింది నిజమే... కనుక వారఫలాల గొప్పతనం నువ్వు ఒప్పుకుతీరాలి.. నువ్వు ఒప్పుకోకపోతే నేనూ ఒప్పుకోను..'' అన్నాడు అఖిలాండేశ్వరరావు బెదిరింపుగా

అఖిలాండేశ్వరరావు వాదనలోని పాయింట్‌కు మెచ్చుకోలుగా చూసిన అంబాజీరావు మాట్లాడలేదు.

( మహా పండితులైన వారఫల కర్తలను అవమానించడానికి ఈ కథ రాయలేదు. కేవలం హాస్యం కోసం రాశాము. వారికి బాధ కల్గిస్తే క్షమించమని కోరుతున్నాము. ఒకసారి సరదాగా వారఫలాలు చదువుతుంటే, 'మాయమాటలతో మిమ్మల్ని ఎవరో మోసం చేస్తున్నారు..' అన్న వాక్యం కనపడింది. అదే ఈ కథకి ప్రేరణ పాలకూర సీతాలత )

*

